# థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక 3వ అధ్యాయము

**తిమోతి సేవకై పంపబడుట**

కాబట్టి ఇక సహింప జాలక ఏథెన్సులో మేమొంటిగానైనను ఉండుట మంచిదని యెంచి, 2 ఈ శ్రమల వలన ఎవడును కదిలింప బడకుండునట్లు మిమ్మును స్థిరపరచుటకును, 3 మీ విశ్వాస విషయమై మిమ్మును హెచ్చరించుటకును మన సహోదరుడును క్రీస్తు సువార్త విషయములో దేవుని పరిచారకుడునైన తిమోతిని పంపితిమి. మేము మీ యొద్దనున్నప్పుడు, మనము శ్రమ అనుభవింప వలసియున్నదని మీతో ముందుగా చెప్పితిమి గదా–ఆలాగే జరిగింది. 4 ఇది మీకును తెలియును అట్టి శ్రమలను అనుభవించుటకు మనము నియమింపబడిన వారమని మీరెరుగుదురు. 5 ఇందుచేత నేనును ఇకను సహింపజాలక శోధకుడు మిమ్మును ఒక వేళ శోధించెనేమో యనియు, మా ప్రయాసము వ్యర్థమై పోయెనేమో అనియు మీ విశ్వాసము తెలిసికొనవలెనని అతనిని పంపితిని. 6 తిమోతియు ఇప్పుడు మీ యొద్ద నుండిమా యొద్దకు వచ్చి మేము మిమ్మును ఏలాగు చూడ నపేక్షించుచున్నామో ఆలాగే మీరు కూడా మమ్మును చూడనపేక్షించుచు, ఎల్లప్పుడును మమ్మును ప్రేమతో జ్ఞాపకము చేసుకొనుచున్నారని మీ విశ్వాసమును గూర్చియు మీ ప్రేమను గూర్చియు సంతోషకరమైన సమాచారమును మాకు తెచ్చెను. 7 అందుచేత సహోదరులారా, మా యిబ్బంది అంతటిలోను శ్రమ అంతటిలోను మీ విశ్వాసమును చూచి మీ విషయములో ఆదరణ పొందితిమి. 8 ఏలయనగా మీరు ప్రభువునందు స్థిరముగా నిలిచితిరా మేమును బ్రతికినట్టే. మేము మీ ముఖము చూచి మీ విశ్వాసములో ఉన్న లోపమును తీర్చునట్లు అనుగ్రహించుమని రాత్రింబగళ్ళు అత్యధికముగా దేవుని వేడుకొనుచుండగా, 10 మన దేవుని యెదుట మిమ్మును బట్టి మేము పొందుచున్న యావత్తు ఆనందము నిమిత్తము దేవునికి తగినట్టుగా కృతజ్ఞతాస్తుతులు ఏలాగు చెల్లింపగలము? 11 మన తండ్రియైన దేవుడును మన ప్రభువైన యేసును మమ్మును నిరాటంకముగా మీ యొద్దకు తీసుకొని వచ్చును గాక. 12 మరియు మన ప్రభువైన యేసు తన పరిశుద్ధులందరితో వచ్చినప్పుడు, 13 మన తండ్రియైన దేవుని యెదుట మీ హృదయములను పరిశుద్ధత విషయమై అనింద్యమైనవిగా ఆయన స్థిరపరచుటకై, మేము మీ యెడల ఏలాగు ప్రేమలో అభివృద్ధి పొంది వర్ధిల్లుచున్నామో, ఆలాగే మీరును ఒకని యెడల ఒకడును మనుష్యులందరి యెడలను ప్రేమలో అభివృద్ధి పొంది వర్ధిల్లునట్లు ప్రభువు దయచేయును గాక.